రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు.. (కిలో.. రూపాయల్లో) టమాటా రూ.29, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.28, కాకర రూ.20, బీర రూ.32, క్యాబేజి రూ.20, ఫ్రెంచిబీన్స్ రూ.40, క్యారెట్ రూ.45, దొండ రూ.23, చిక్కుడు రూ.45, గోకర రూ.23, బీట్‌రూట్ రూ.43, క్యాప్సికం రూ.55, ఆలు రూ.35, దోస రూ.23, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.13, ఉల్లిగడ్డ రూ.40, చామగడ్డ రూ.35. గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

మలక్‌పేట: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మలక్‌పేట హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ ఎం.విజయలక్ష్మి తెలిపారు. గత నెల 28వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు పూణెలో నిర్వహించిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థి శార మాధురి బంగారు పతకం, శృతి సారిక, బస్వరాజు, వైష్ణవి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారని తెలిపారు. విజయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి నిర్మల, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, కరాటే మాస్టర్లు పిల్లి శ్రీనివాస్, సాయి హనిష, శివానీ విద్యార్థులను అభినందించారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



చంపాపేట: డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ హుండీని గురువారం రాత్రి లెక్కించారు. భక్తులు స్వామి వారికి కానుకల రూపంలో 170 రోజులకు రూ.57.63 లక్షల నగదు, 273 డాలర్లు, 5 యూరోస్, 200 ఒమన్ రియల్స్, 235 అరబ్ దర్హమ్స్, 10 పౌండ్స్‌లను సమర్పించారని ఆలయ ఈఓ లావణ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంబయ్య, సంతోష్‌కుమార్, శ్రవణ్‌కుమార్, సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, వేణుగోపాల్, స్వాతి, మాజీ ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: దిల్‌సుఖ్‌నగర్ జోన్‌లోని నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో వనస్థలిపురం నారాయణ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అన్ని తరగతుల నుంచి తమ విద్యార్థులు అనేక బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భవానీ తెలిపారు. కార్యక్రమంలో బయోగ్రీన్ రెమెడీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణప్రసాద్, పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్‌ఐ రవిప్రసాద్, కోఆర్డినేటర్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదు



సైదాబాద్ పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

సైదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదని బీఆర్‌ఎస్ యాకత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కొరుడు భూమేష్ అన్నారు. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను సైదాబాద్ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరసన తెలిపే ప్రతిపక్షాల హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు. అరెస్టయిన వారిలో బీఆర్‌ఎస్ ఐఎస్‌సదన్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ధర్మరాజు, శ్రీధర్, హరి ఉన్నారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో పేలుడు



ధ్వంసమైన స్టోర్ రూం



గాయపడిన సూర్యకళ

లింగోజిగూడ: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుభ్రం చేసిన చెత్తను ఒకచోట చేర్చి నిప్పు పెట్టడంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మహిళ స్వీపర్ తలకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జీఎంఆర్ ద్వారా ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పనిచేస్తున్న సూర్యకళ పోలీస్‌స్టేషన్ అవరణలో స్టోర్ రూంను శుభ్రం చేసి చెత్తను ఒకచోట చేర్చింది. అనంతరం చెత్తకు నిప్పుపెట్టింది. కొద్ది సేపటికే ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో సూర్యకళ తలకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సైన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు. పేలుడు దాటికి స్టోర్ రూం ధ్వంసం కావడంతో పాటు పలు ఫైళ్లు తగలబడినట్లు తెలుస్తోంది. ఖాళీ బాటిల్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొంటున్నారు. ఘటన స్థలం నుంచి శాంపిల్స్ సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



ఎల్‌బీనగర్‌లో నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



ఎల్‌బీనగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి



సాహెబ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న



మలక్‌పేటలో.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ మాదిగ

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం



చంపాపేట చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో డా.బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఎల్‌బీనగర్ ఉత్సవాల కమిటీ కన్వీనర్ ఆదాల రమేష్, కొంగరి నర్సింహారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, దళిత సంఘాల నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

– ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ బృందం



హరిజనబస్తీలో కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు



కొత్తపేటలో కార్పొరేటర్ పవన్‌కుమార్



బండ్లగూడలో జీఎస్‌ఐ ఉద్యోగులు



ఆర్‌కేపురంలో బీఆర్‌ఎస్ నాయకులు అరవింద్‌శర్మ



మూసారంబాగ్‌లో.. బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

పార్కులను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని పార్కులను అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–1 నార్త్‌పార్ట్ పెద్ద పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 6వేల గజాలు ఉన్న ఈ పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్, పచ్చదనంతో ఆహ్లాదంగా మారుస్తానని తెలిపారు. కొంత మంది పార్కు వద్దని కోర్టుకు వెళ్లడంతో అభివృద్ధి చేయడంలో ఆలస్యమైందని అన్నారు. ప్రస్తుతం కోర్టు తీర్పు కాలనీవాసులకు అనుకూలంగా రావడంతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు సామ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్స్ క్వార్టర్స్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు చేరేలా చూడాలని మంత్రి సూచించారని ఆయన పేర్కొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ మెరుగైన ప్రజాపాలన అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ సిటీ కేఫ్ చౌరస్తాలో కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు నాగరిగారి దాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట్ల శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీస్టేడియం సాక్షిగా 54 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో కోట్ల లడ్డూపటేల్, దేవీనాయక్, సరోజ, చిట్టి, ప్రేమ్‌కుమార్, అక్బర్, నాగిళ్ల శ్రీరాములు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కోట్ల శ్రీనివాస్ తదితరులు

చనిపోతూ పలువురికి పునర్జన్మ



విజిత (ఫైల్)

మన్సూరాబాద్: యువకుడి ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోతూ ఓ మహిళ మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపింది. గుండె, లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్ సభ్యులు సేకరించారు. జీవన్‌ధాన్ ప్రతినిధులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చిన్న అరిశర్లపల్లి గ్రామానికి చెందిన విజిత(55) కొంతకాలంగా వనస్థలిపురంలో నివాసముంటోంది. కొత్తపేట చౌరస్తా వద్ద గురువారం రోడ్డు దాటుతుండగా పల్సర్ బైక్‌పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ యువకుడు ఆమెను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన ఆమెను ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. ఐసీయూలో చికిత్స అందించగా శుక్రవారం ఉదయం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు ఆమె భర్త ఇంద్రకంటి సుధాకర్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో గుండె, లివర్, రెండు కార్నియాలు, రెండు కిడ్నీలను జీవన్‌ధాన్ ప్రతినిధులు సేకరించారు.

మరో ఘటనలో..



దేవరపల్లి మోహన్‌రెడ్డి(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామానికి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి(42) డ్రైవర్. గత నెల 24న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు ఈ నెల 4న వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు మోహన్‌రెడ్డి భార్య రోజ, కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. కుటుంబసభ్యుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్ ప్రతినిధులు సేకరించారు.

పదేళ్లలో ఆటో కార్మికులను పట్టించుకోలేదు

ఉప్పల శ్రావణ్‌కుమార్ గుప్తా



లింగోజిగూడ: బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి శనివారం ఆటో, క్యాబ్‌ల బంద్‌లో పాల్గొనవద్దని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉప్పల శ్రావణ్ కుమార్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఆటో కార్మికుల గురించి ఏనాడూ ఆలోచించలేదని అన్నారు. కొంత మంది నాయకులు జేఏసీగా ఏర్పడి ట్రాన్స్‌పోర్టు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని, పదేళ్లలో ఒక్కసారి కూడా కార్మికుల తరఫున పోరాడిన పాపాన పోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఒక్కసారైనా రవాణా శాఖ మంత్రి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారా..? వారి సమస్యలను పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. కొంత మంది బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయి కార్మికులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వం హామీ ఇస్తుంటే కనీసం సమయం ఇవ్వకుండా బంద్‌కు పిలుపునివ్వడం సరికాదని సూచించారు. బంద్‌లో ఆటో కార్మికులు ఎవరూ పాల్గొనవద్దని పిలుపునిచ్చారు.

పరామర్శ



ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను పరామర్శిస్తున్న మధుయాష్కి

మన్సూరాబాద్: అనారోగ్యంతో ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి శుక్రవారం పరామర్శించారు. కామినేని వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్ తదితరులున్నారు.

నేడు పేరెంట్–టీచర్ మీటింగ్

మీర్‌పేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పేరెంట్–టీచర్ మీటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు సమావేశానికి హాజరై తమ పిల్లల చదువులకు సంబంధించిన విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకోవడంతో పాటు ఇతర విషయాలపై చర్చించవచ్చని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 90 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నాగోలు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రో కబడ్డీ జూనియర్స్ క్రీడాకారులు పూణెలో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం అయ్యేందుకు కబడ్డీ పోటీలను ఉప్పల శ్రీనివాస్‌గుప్తా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో విజయం సాధించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తోందని, క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రవికుమార్, విమల, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్‌నాయక్, మమత తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్స్

నాగోలు: విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి తీసే వేదిక సైన్స్ ఫెయిర్ అని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని అజయ్‌నగర్ కాలనీలో చాణక్య హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్స్ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతిని తెలుసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ దేవమ్మ, నాయకులు సిద్ధాల ఐలయ్య, శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిగేల్ జిగేల్.. ఫ్లైఓవర్స్



సాగర్ రింగ్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద..

రంగురంగుల విద్యుత్ దీపాలతో ఎల్‌బీనగర్ ఫ్లైఓవర్లు జిగేల్‌మంటున్నాయి. ఎల్‌బీనగర్‌లోని అండర్‌పాసులు, ఫ్లైఓవర్లను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో వాహనదారులు వావ్ అంటున్నారు. నిత్యం ఈ మార్గాల్లో ప్రయాణించే తమకు ఈ విద్యుత్ వెలుగులు చూస్తే సంతోషం కలుగుతోందని పలువురు వాహనదారులు తెలిపారు – మన్సూరాబాద్



ఎల్‌బీనగర్ ఫ్లైఓవర్